

ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో సమావేశమైన ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి

## సాగు, తాగునీటికి ఇబ్బంది రావొద్దు

**వరంగల్ ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి**

హనుమకొండ, మార్చి 9 : వేసవిని దృష్టిలో పెట్టుకొని ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి కొండా సురేఖ, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రజా ప్రతినిధుల సలహాలు తీసుకొని వ్యవసాయానికి, తాగునీరుకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్‌కు సంబంధించి సోమవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దగ్గర సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో మరింత వేగం పెంచాలని, ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపికను మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలు, ఆలోచనల ప్రకారం కలెక్టర్లు పనిచేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై సందేహాలు ఉంటే కలెక్టర్లు నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపికలో స్థానిక ఎమ్మెల్యేల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని కలెక్టర్లు తుది నిర్ణయం తీసుకోవాలని, ఎంపికలో నిరుపేదలకు ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. నిర్మాణం పూర్తయిన డబుల్‌బెడ్‌రూం ఇండ్ల లబ్ధిదారులను సైతం ఎంపిక చేయాలని, అసంపూర్తిగా ఉన్న వాటిని కాంట్రాక్టర్లు పూర్తి చేయని పక్షంలో లబ్ధిదారులే పూర్తి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరంగల్ మామూనూర్ ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగురోడ్డు భూసేకరణ వేగవతం చేయాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. సమావేశంలో ఎంపీలు బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి, మురళీ నాయక్, రామచంద్రునాయక్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్లు పాల్గొన్నారు.

## సీపీ అంబర్ కిశోర్ ఝాకు ఆత్మీయ వీడ్కోలు



సీపీ అంబర్ కిశోర్‌ఝాను ప్రత్యేక వాహనంలో తీసుకెళ్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

సుబేదారి, మార్చి 9 : వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా, ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ బదిలీ అయిన సందర్భంగా ఆదివారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో వారికి పోలీసు అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. అంబర్ కిశోర్‌ఝాను ప్రత్యేక వాహనంలో నిలబెట్టి సిబ్బంది, పోలీసు అధికారులు తాడుతో లాగి వీడ్కోలు పలికారు. అనంతరం జ్ఞాపికలు అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా అంబర్ కిశోర్‌ఝా మాట్లాడుతూ రాణి రుద్రమదేవి పాలించిన చారిత్రక వరంగల్‌లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఆరేళ్లుగా ఓఎస్డీగా, ఎస్పీగా, కమిషనర్‌గా పనిచేయడం సంతోషంగా ఉందన్నారు. నేరస్తులను పట్టుకోవడంలో వరంగల్ పోలీసులు దిట్ట అని కొనియాడారు. డీసీపీ రవీందర్ మాట్లాడుతూ వరంగల్‌లో పనిచేయడం చాలా సంతృప్తింగా ఉందన్నారు. డీసీపీలు షేక్ సలీమా, అంకిత్‌కుమార్, ఏఎస్పీ చైతన్య, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## సాగునీటి కోసం రెండు గ్రామాల మధ్య కొట్లాట

చిన్నగూడూరు, మార్చి9: ఎస్సారెస్పీ జలాల కోసం రెండు గ్రామాల రైతులు కొట్లాడుకున్న ఘటన శనివారం రాత్రి మహబూబాబాద్ జిల్లాలో చోటుచేసుకుంది. మరిపెడ మండలంలోని ఆర్లగడ్డ తండా గుండా వెళ్లే డీబీఎం 60 మెయిన్ కాల్వ నుంచి 18ఎల్ ఉపకాల్వ దుబ్బతండా, బాల్యతండా గ్రామాల మీదుగా చిన్నగూడూరు మండలంలోని విస్సంపల్లి, తుమ్మల చెరువుతండా గ్రామాల చెరువులకు వెళ్తుంది. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు ఎస్సారెస్పీ కాల్వను విస్సంపల్లి, తుమ్మల చెరువుతండా ఆయకట్టు రైతులు కలిసి రూ. 70 వేలు ఖర్చుపెట్టుకుని కాల్వను బాగుచేసుకున్నారు.తీరా నీళ్లు వచ్చే సమయానికి బాల్యతండావాసులు విస్సంపల్లికి వెళ్లే ఎస్సారెస్పీ కాల్వకు అడ్డుకట్ట వేసి తమ పంటపొలాలకు నీటిని మళ్లించుకున్నారు. తమ గ్రామానికి కూడా నీళ్లు వదలాలని పలుమార్లు చెప్పినప్పటికి బాల్యతండా వాసులు వినకుండా తమతో గొడవపడినట్లు విస్సంపల్లి రైతులు తెలుపుతున్నారు. దిగువకు నీరు రాకుండా అడ్డుకట్ట వేయవద్దని కోరినా తండావాసులంతా కలిసి తమపై తిరగబడినట్లు ఆరోపించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేదని, సాగు నీటికోసం గ్రామాల మధ్య కొట్లాటలు తీవ్రతరం కాకముందే అన్ని గ్రామాలకు నీరందేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. పొలాలు ఎండిపోతున్నాయని, ఎస్సారెస్పీ కాల్వల ద్వారా తమ గ్రామానికి నీరందించాలని వేడుకుంటున్నారు.

## కాకతీయ ద్వార తోరణాన్ని పరిరక్షించాలి

**పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి**



పురాతన శివాలయ తోరణాన్ని చూపిస్తున్న పరిశోధకులు

హనుమకొండ, మార్చి 9: కాకతీయ పాలకుల మొదటి రాజధాని అనుమకొండ ప్రాంతంలోని అగ్గలయ్య గుట్ట సమీపంలో ఉన్న కాకతీయ తోరణ ద్వారాన్ని ప్రభుత్వం పరిరక్షించాలని ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కోరారు. వరంగల్ నగరానికి చెందిన పరిశోధకుడు అరవింద్ ఆర్యతో కలిసి ఆయన ఆదివారం హనుమకొండలో పర్యటించిన ఆయన మాట్లాడారు. అగ్గలయ్య గుట్ట సమీపంలో ఉన్న ఈ తోరణం రోడ్డు నిర్మాణంలో భాగంగా నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. నాటి కాకతీయ శిల్పుల కళా నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనంగా నేటికీ నిలిచిన కీర్తితోరణం కాకతీయుల సామ్రాజ్య విజయ చిహ్నం అని పేర్కొన్నారు. కాకతీయుల మొదటి రాజధాని హనుమకొండ పద్మాక్షి గుట్ట వద్ద ఏర్పాటుచేసిన మొదటి దశ తోరణం వరంగల్ కోటలోని కాకతీయ కీర్తి తోరణ ద్వారాల కన్న ఎంతో ప్రాచీనమైనదని, దీన్ని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ప్రముఖ స్థపతి బీ సుధాకర్ సింగ్, స్థానికుడు శంభు దయాల్ ఠాకూర్ పాల్గొన్నారు.

# కేసీఆర్ సీఎం కావడం ఖాయం

- ప్రజలు బీఆర్ఎస్‌నే కోరుకుంటున్నారు
- స్థానిక సంస్థల ఎన్నికలంటే కాంగ్రెస్‌కు భయం
- బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పాలకుర్తి, మార్చి 9: త్వరలోనే కేసీఆర్ సీఎం కావడం ఖాయమని, రాష్ట్రంలోని ప్రజలు బీఆర్ఎస్, కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఆదివారం జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ ఇటీవల కాంగ్రెస్, బీజేపీలు నిర్వహించిన సర్వేల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌ను కోరుకుంటున్నారన్నారు. అందుకే ప్రభుత్వం స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించడానికి భయపడుతున్నదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు ప్రజల మధ్య ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్షంలోనే నాయకుడిగా ఎదగడానికి అవకాశాలు ఉంటాయన్నారు. తన కోసం, పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్త, నాయకుడిని కాపాడుకుంటానన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు, 420హామీలు అమలు చేయలేక అవస్థలు పడుతున్నారన్నారు. రేవంత్‌కు పాలన చేతగాక చేతులెత్తే రోజులు దగ్గర పడ్డాయన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌దే అధికారం ఖాయమన్నారు. సీఎంగా కేసీఆర్, మంత్రిగా తాను ప్రజలకు సేవ చేస్తానన్నారు. ఏప్రిల్ 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పల్లా సుందర్‌రామిరెడ్డి, జినుగు అనిమిరెడ్డి, బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, పసునూరి నవీన్, తీగల దయాకర్, పుస్కూరి శ్రీనివాసరావు, మంగళంపల్లి శ్రీనివాస్, శ్రీరాం సుధీర్‌కుమార్, ఈదూరు ఐలయ్య, రంగు కుమార్, తూర్పాటి ఆంజయ్య, రామిని శ్రీనివాస్, కుర్ర శ్రీనివాస్, మాచర్ల ఎల్లయ్య, బొబ్బల అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

















